క్లుప్తంగా

మంత్రి పొన్నంకు ఆహ్వానం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లిలో ఈనెల 18నుంచి 20 వరకు నిర్వహించనున్న దుర్గమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి రావాలని కోరుతూ ఆదివారం గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సాహెబ్, జిల్లా కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు అందె బాలయ్య, చంద్రం, బొల్లి లింగం, లక్ష్మణ్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

'కదనభేరి సభను విజయవంతం చేయండి'

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఈనెల 12న కరీంనగర్‌లో మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో జరగనున్న కదనభేరి సభను విజయవంతం చేయాలని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పిలుపునిచ్చారు. ఆదివారం ఇల్లంతకుంట మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి భారీగా జనసమీకరణ చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బోయినపెల్లి వినోద్‌కుమార్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహా రెడ్డి, ఎంపీటీసీ వొగ్గు నర్సయ్య యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అసంపూర్తి తరగతి గదుల పరిశీలన


అసంపూర్తి గదులు పరిశీలిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అసంపూర్తిగా ఉన్న తరగతి గదులను కాంగ్రెస్ నాయకులు ఆదివారం పరిశీలించారు. గత విద్యాసంవత్సరం ఎల్లారెడ్డిపేటకు మహాత్మా జ్యోతి బాపూలే డిగ్రీ కళాశాల మంజూరుకాగా ప్రస్తు తం అద్దె భవనంలో కొనసాగుతోంది. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అసంపూర్తిగా ఉన్న బేస్‌మేట్ నిర్మాణంతో ఉన్న తరగతిగదులను పరిశీలించారు. జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజు, యూత్ కాంగ్రెస్ నాయకులు బుచ్చిలింగు, సంతోష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడిపై కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు



తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ఉడుతల తిరుపతిపై ఆదివారం కాంగ్రెస్ నాయకులు తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లెల్లకు చెందిన తిరుపతి తెలంగాణ ముఖ్యమంత్రిని, కాంగ్రెస్ పార్టీ నాయకులను కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు, స్టేటస్‌లు పోస్టు చేస్తున్నాడని ఆరోపించారు. బూతులు, అసత్య పదజాలంతో పోస్టులు పెట్టి కాంగ్రెస్ పార్టీ నాయకులను రెచ్చగొడుతున్నాడని అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు అందించిన వారిలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, జి.శ్రీనివాస్‌రెడ్డి, టి.శ్రీనివాస్, సలీంఖాన్, బాల్‌రెడ్డి, ఎండీ.హబీబ్, ఆయూబ్ తదితరులు ఉన్నారు.

దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ



కోనరావుపేట: మండలంలోని సుద్దాలలో దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఎంపీటీసీ కాశవేని మమత, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ కాశవేని మహేశ్ ఆదివారం ఆవిష్కరించారు. కులసంఘాల, యూత్ నాయకులు రాజయ్య, రామస్వామి, ఎల్లయ్య, పర్శరాములు, కుడుకుల నాగరాజు, నాయకులు ఎల్లయ్య, లక్ష్మీనారాయణ, శంకర్, విజయ్, మహేశ్, భూమేశ్, రాకేశ్, మహేశ్, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమావేశం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్ శివారులోని సింగసముద్రం కట్టపై ఉన్న మైసమ్మకు ఘనంగా వేడుకలు నిర్వహించాలని ఆయకట్టు రైతులు నిర్ణయించారు. ఆదివారం ఎల్లారెడ్డిపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులు సమావేశమయ్యారు. యాసంగిలో వరిపంట చేతికొచ్చే సమయంలో ఏటా మాదిరిగానే ఈ ఏడు అమ్మవారికి వేడుకలు జరపాలని, ఆయకట్టు రైతులు ఎకరానికి రూ. 200 చెల్లించాలని నిర్ణయించారు. ఏప్రిల్ మొదటి వారంలో పండుగ జరుపుకోవాన్నారు.

మట్టి కూలి.. నీరు నిలిచి

- ఫోర్‌లేన్ రోడ్డుతో మట్టి కూలి మురుగుకాల్వల్లో నిలుస్తున్న నీరు
- పలుచోట్ల దెబ్బతిన్న పైపులైన్లు
- వేసవిలో వెంకట్రావుపల్లి వాసుల తిప్పలు


మట్టి కూలడంతో మురుగు కాలువలో నిలిచిన నీరు

బోయినపల్లి(చొప్పదండి): కరీంనగర్–సిరిసిల్ల ప్రధాన రహదారిలో మండలంలోని వెంకట్రావుపల్లి పరిసరాల్లో చేపడుతున్న ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణంతో మురుగుకాల్వలు పూడుకుపోయి, రక్షిత మంచినీటి వ్యవస్థ దెబ్బతింది. దీంతో అక్కడి ప్రజలు కొద్దిరోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ.10కోట్ల అంచనాలతో నర్సింగాపూర్ బార్డర్ నుంచి వెంకట్రావుపల్లి కెనాల్ వరకు ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. రోడ్ల వెడల్పుతో మధ్యలోని పోల్స్ తొలగించి నూతన విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ 45 ఫీట్ల మేర రోడ్డు వెడల్పుకు తీర్మానం ఇచ్చినట్లు మాజీ సర్పంచ్ బూర్గుల నందయ్య తెలిపారు. 45 ఫీట్లలో ఫోర్‌లేన్ రోడ్డు, నీటి పైప్‌లైన్, విద్యుత్ స్తంభాలు, మురుగు కాల్వలు నిర్మాణం చేయాలన్నారు.

పూడుకుపోయిన మురుగుకాల్వలు

గతంలో ఉన్న డబుల్ రోడ్డుకు అనుగుణంగా అప్పుడు రోడ్డుకు ఇరువైపులా సుమారు రెండు కిలోమీటర్ల మేర మురుగుకాల్వలు నిర్మించారు. కొత్తగా ఇటీవల ఫోర్‌లేన్ రోడ్డుకోసం రోడ్ల వెడల్పు చేశారు. రోడ్డు నిర్మాణంలో మట్టిపడి పలు చోట్ల మురుగునీరు బయటకు వెళ్లే వీలులేక నీరు నిలిచిపోయింది. కొన్నిచోట్ల మురుగుకాల్వల్లో నీరు చాలా రోజులుగా నిల్వ ఉండడంతో దోమలు ప్రబలి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

గ్రామస్తుల ఇబ్బందులు

గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ నీటి పథకాలతో ప్రజలకు నీటి సరఫరా జరిగేది. రోడ్ల వెడల్పుతో ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ పైపులైన్లు రోడ్డుకిందకు పూడుకుపోయాయి. దీంతో గ్రామస్తులకు సరైన నీటిసౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గ్రామస్తుల ఫిర్యాదుతో కొన్నిచోట్ల కొత్తగా నీటి పథకం పనులు చేశారు. ఇంకా లెఫ్ట్ కెనాల్ నుంచి రోడ్డుకిరువైపులా మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికి విద్యుత్ సబ్‌స్టేషన్, రూసో కళాశాల పరిసరాల్లో నివాసం ఉండే సుమారు 15 ఇళ్లకు నీటి సరఫరా జరగడం లేదని ప్రజలు వాపోతున్నారు.

డీపీవో విచారణ

ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణంతో మట్టిపడి మురుగుకాల్వలు పూడుకుపోయాయని ఇటీవల గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈనెల 17న మురుగుకాల్వలు, తాగునీటి పైప్ లైన్ వ్యవస్థను డీపీవో వీర బుచ్చయ్య క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ, వాటర్‌గ్రిడ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని ఆయన చెప్పినట్లు గ్రామస్తులు తెలిపారు.

నీళ్లు వస్తలేవు



కొత్తగా రోడ్డు వేసినంక రోడ్డుకింద పైపులైన్ మునిగిపోయిందని అంటున్నరు. దీంతో పైపులైన్ లేకపోవడంతో మా ఏరియాలో 15 ఇళ్లకు నీళ్లు రావడం లేదు. బోరు వేసుకున్న ఇళ్ల వారి నుంచి బతిమిలాడి నీళ్లు తెచ్చుకుంటున్నం. మా పదిహను ఇళ్లకు పైప్‌లైన్ వేసి నీరందించాలి.

– చెంచు సుజాత, వెంకట్రావుపల్లి

అస్తవ్యస్తంగా డ్రైనేజీ



రోడ్ల వెడల్పుతో మెయిన్ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతింది. ఎస్సీ కాలనీ నుంచి పెద్ద బ్రిడ్జి వరకు ఒకవైపు, రాజయ్య హోటల్ నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు మరోవైపు రెండు కిలోమీటర్ల మేర మురుగు కాల్వలు అస్తవ్యస్తంగా మారాయి. నీరు వెళ్లేదారి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– బూర్గుల నందయ్య, మాజీసర్పంచ్, వెంకట్రావుపల్లి

దుర్గంధం వెదజల్లుతోంది



గ్రామంలో రోడ్ల వెడల్పుతో మురుగుకాల్వలు మొత్తం పూడుకుపోయాయి. పడిన మట్టితో నీరు వెళ్లకపోవడంతో పలుచోట్ల నీరు నిలిచి దుర్గంధం వ్యాప్తిస్తోంది. రోజు మురుగుకాల్వల్లో పేరుకుపోతున్న మట్టి తీయాల్సి వస్తోంది.

– మొకిడె మారుతి, వెంకట్రావుపల్లి

మురుగుకాల్వల నిర్మాణానికి చర్యలు



వెంకట్రావుపల్లి ఫోర్‌లేన్ రోడ్డు పరిసరాల్లో ల్యాండ్ క్లియరెన్స్ ఇస్తే డ్రెయిన్ నిర్మాణం చేపట్టేందుకు ఆర్‌అండ్‌బీ ఈఈ, డీఈలతో మాట్లాడి నిర్మాణం మంజూరు చేస్తాం. ఈ విషయంపై డీపీవోకు వివరించాం. మురుగు కాల్వల నిర్మాణానికి చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఆర్. సతీశ్, ఆర్‌అండ్‌బీ, ఏఈ, బోయినపల్లి

సావిత్రిబాయిని ఆదర్శంగా తీసుకోవాలి

సిరిసిల్లటౌన్: సావిత్రిబాయి పూలే వర్ధంతని సిరిసిల్లలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సుభాష్‌నగర్‌లోని కార్మిక భవనంలో నిర్వహించిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు మాట్లాడారు. దేశంలోని మొదటి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రీబాయి పూలే జీవితం ఆదర్శంగా తీసుకొని అన్నివర్గాలవారు ముందుకెళ్లాలన్నారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు పంతం రవి, లక్ష్మణ్, వేణు, నాగరాజు, సత్తయ్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో..

బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కోఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి యి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మట్టె శ్రీనివాస్, నవీన్, రవి, రాకేష్, స్వామి, జగన్, వంశీ, పవన్, గణేశ్, నరేశ్, తిరుపతి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలకేంద్రంలో తెలంగాణ మాల మహానాడు ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలంలోని అడవిపదిరలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు.


నివాళి అర్పిస్తున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులు

ఘనంగా బోనాలు



రుద్రంగి: మండలంలోని మానాలలో ఆదివారం బద్ది పోచమ్మ పండగను నిర్వహించారు. ఏటా మహా శివరాత్రి వేడుకలు, శివ పార్వతుల కల్యాణం మరుసటి రోజు బద్ది పోచమ్మకు బోనాలు సమర్పించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు నెత్తిన బోనాలతో ఆదివారం ఆలయానికి తరలివెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు, గ్రామస్తులు , తదితరులు పాల్గొన్నారు.

అందని 'ఉపాధి' వేతనాలు

- రెండు నెలలుగా ఇబ్బందులు
- ఎండలోనే పనులు చేస్తున్న కూలీలు
- వసతులు కల్పించాలని విజ్ఞప్తి


నిజామాబాద్ గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కోనరావుపేట: ఉపాధి కోసం వలస వెళ్లకుండా గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఉపాధి కల్పించి వారికి వేతనాలు అందించేందుకు అమలుచేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారు. కాగా కూలీలకు సరిపడా వసతులు ఏర్పాటు చేయకపోవండంతో పాటు రెండునెలలుగా వారికి వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఏటా వేసవిలో అందించే అదనపు అలవెన్స్‌లు సైతం నిలిపివేశారు.

11,095 మందికి జాబ్‌కార్డులు

మండలంలోని 28 గ్రామాల్లో కలిపి 11,095 జాబ్‌కార్డులున్నాయి. ఇప్పటివరకు 6,506 మంది కూలీలకు 152838 పనిదినాలు కల్పించారు. కాగా మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి కూలీలకు కొన్నేళ్లుగా మెడికల్ కిట్లు అందడం లేదు. పారలు, గడ్డపారలు కొన్నేళ్ల క్రితం పంపించినా అవి కూడా నిలిపివేశారు.

మేట్లతోనే పనులు

మండలంలోని 9 గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేరు. నూతనంగా ఏర్పాటైన గ్రామాలు గొల్లపల్లి (కొలనూర్), గోవిందరావుపేట తండా, జై సేవాలాల్ భుక్యారెడ్డి తండా, ఊరుతండా, కమ్మరిపేట తండా, గొల్లపల్లి(వట్టిమల్ల), అజ్మీరాతండా గ్రామాలతో పాటు మేజర్ గ్రామాలైన కోనరావుపేట, నిజామాబాద్ గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేరు. ఈ గ్రామాల్లో సీనియర్ మేట్లతో పనులు చేయిస్తున్నారు.

వసతులు కల్పించాలి



ఉపాధి హామీ పనులు జరుగుతున్న స్థలాల్లో కూలీలకు కనీస సరైన వసతులు లేవు. గ్రామంలో చెరువుకట్ట పనులు చేస్తున్నాం. ఇంతకుముందు నీడకోసం కవర్లు ఏర్పాటు చేసేవారు. ఇప్పుడు ఎలాంటి ఏర్పాట్లు చేయడంలేదు. పల్లెల్లో ఉదయం 7 గంటలకే పనులకు వెళ్లి 11.30 గంటలకు ఇంటికి చేరుతున్నాం.

– బర్మ మమత, నిజామాబాద్

వేతనాలు అందడం లేదు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు వేతనాలు సరైన సమయంలో చెల్లించడం లేదు. జనవరిలో ఉపాధి పనులకు వెళ్లాం. కానీ ఇప్పటివరకు ఆ పనులకు సంబంధించిన వేతనాలు రాలేవు. వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు ఇంట్లో ఖర్చులు, ఇతర అవసరాల కోసం ఇబ్బందులు పడుతున్నాం.

–తాళ్లపెల్లి దేవవ్వ, కూలీ

వైద్య సదుపాయాలు కల్పించాలి



ప్రస్తుతం వేసవి ప్రారంభమైంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పనులు చేస్తున్నాం. కూలీలు వడదెబ్బకు గురైతే వైద్య సదుపాయాలు కూడా అందుబాటులో లేవు. గ్రామాల్లో పనిచేస్తున్న ఆశాకార్యకర్తలు వచ్చి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఇచ్చి వెళ్తున్నారు.

-కవ్వంపెల్లి నర్సవ్వ, కూలీ

ఈసారి మాత్రమే ఆలస్యం

"ఉపాధిపని చేస్తున్న స్థలాల్లో నీడకోసం గతంలో పరదాలు, కూలీల కోసం పారలు, గడ్డపారలు వచ్చేవి. కొన్నేళ్లుగా వాటి సరఫరా నిలిచిపోయింది. అలాగే మెడికల్ కిట్లు కూడా రావడం లేదు. కూలీలకు వేతనాలు రెగ్యులర్‌గానే వస్తున్నాయి. ఈ సారి మాత్రమే ఆలస్యం అయ్యాయి.

– మంచికట్ల శ్రీనివాస్, ఏపీవో"

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమావేశమైన మండెపల్లి పాఠశాల పూర్వ విద్యార్థులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని తంగళ్లపల్లి, మండెపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. మండెపల్లిలో 2003–04 బ్యాచ్, 2004–05 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సమావేశమై తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. మండెపల్లి పాఠశాల పూర్వ విద్యార్థులు పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రపరిచి చెట్లకు రంగులద్దారు. పాఠశాలకు రూ.5వేలతో బోరు కొనుగోలు చేశారు. రూ. 20వేలతో విద్యార్థులకు ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేసేందుకు ముందుకువచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశమైన తంగళ్లపల్లి పాఠశాల పూర్వ విద్యార్థులు

రైతులకు ద్రోహం చేసిన మాజీ మంత్రి కేటీఆర్

ఎల్లారెడ్డిపేట: సిరిసిల్ల నియోజకవర్గంలోని రైతులను మాజీ మంత్రి కేటీఆర్ ద్రోహం చేశారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఆరోపించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మల్కపేట రిజర్వాయర్ నుంచి 9వ ప్యాకేజీ కింద సింగసముద్రం, ఎగువమానేరుకు వచ్చే కాల్వను పూర్తి చేయక రైతుద్రోహిగా కేటీఆర్ మిగిలిపోయారన్నారు. మిడ్ మానేరు నుంచి సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాలకు 11, 12వ ప్యాకేజీలను పూర్తిచేసి నీటిని తీసుకెళ్లారన్నారు. మేడిగడ్డ బ్యారేజీకి పిల్లర్లు కుంగి బుంగలుపడి 60 టీఎంసీల నీరు సముద్రం పాలు చేసిన ఘనత గత ప్రభుత్వానిదేనని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గంట బుచ్చాగౌడ్, చెన్నిబాబు, గుండాటి రాంరెడ్డి, రఫీక్ పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి


సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముస్తాబాద్: మండల సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి కృషిచేస్తున్నారని మండలశాఖ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని నామాపూర్‌లో శ్రీ మల్లికార్జునస్వామి ఆలయానికి సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. ఈజీఎస్ నిధులు రూ.10లక్షల వ్యయంతో చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేయాలని ఆయన కోరారు. సీసీరోడ్లు, డ్రైనేజీలు, సామాజిక భవనాల నిర్మాణాల పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొండం రాజిరెడ్డి, అనిల్, కొమురయ్య, ఎల్సాని దేవయ్య, అంజన్‌రావు, తలారి నర్సింలు, సుధాకర్‌రావు, భాను, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నార

'చల్మెడ'ను విమర్శిస్తే ఊరుకోం


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

వేములవాడ: వేములవాడ మున్సిపల్ వార్డు కౌన్సిలర్లుగా పార్టీ టికెట్‌పై గెలిచి వైస్‌చైర్మన్ ఎన్నిక సందర్భంగా పార్టీ సూచించిన వ్యక్తిని కాకుండా కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేసిన వెన్నుపోటుదారులు చల్మెడ లక్ష్మీనర్సింహరావును విమర్శించే హక్కు లేదని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అన్నారు. ఆదివారవారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ నుంచి మారం కుమార్‌ను వైస్‌చైర్మన్‌గా ఎన్నుకోవాలని ప్రకటిస్తే లేనిపోని ఆరోపణలు చేస్తూ పార్టీకి ద్రోహం చేసి ఇతర పార్టీ అభ్యర్థిని గెలిపించారన్నారు. కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, శంకర్, గోలి మహేశ్, చందు, నాయకులు క్రాంతికుమార్, శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'గృహజ్యోతి'ని సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం అమలుచేస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని పదిర, దుమాల, అల్మాస్‌పూర్, నారాయణపూర్, ఎల్లారెడ్డిపేట, కోరుట్లపేట, బాకూర్‌పల్లి తండాలో విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లులను అందజేశారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, జిల్లా కార్యదర్శి వంగ గిరిధర్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, చెన్నిబాబు, బండారి బాల్‌రెడ్డి, పందిర్ల శ్రీనివాస్ గౌడ్, గుర్రపు రాములు, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని చిన్నలింగాపూర్‌లో గృహజ్యోతి పథకాన్ని ఎంపీటీసీ బైరినేని రాము ఆదివారం ప్రారంభించారు. లైన్‌మన్ రమేశ్, కనకయ్య, మాధవ రెడ్డి, చరణ్ పాల్గొన్నారు.

మినీ స్టేడియం నిర్మాణానికి స్థల పరిశీలన

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రూ.80 లక్షలతో క్రీడాకారుల కోసం ప్రభుత్వం మినీ స్టేడియం నిర్మాణ పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసింది. నిర్మాణ పనులకోసం కాంగ్రెస్ నాయకులు ఆదివారం స్థలాన్ని పరిశీలించారు. జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ..మండల కేంద్రంలో క్రీడాకారులకు అనుకూలంగా మినీ క్రీడా స్టేడియం నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరగానే రూ.80లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. నాయకులు ఒగ్గు బాల్‌రాజ్, శ్రీనివాస్ రెడ్డి, సంతోష్ గౌడ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు

ఎల్లారెడ్డిపేట: ఎమ్మెల్యే కేటీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి చందుపట్ల లక్ష్మారెడ్డి అన్నారు. మండలకేంద్రంలో ఆయన మాట్లాడారు. ఎంపీ బండి సంజయ్‌కుమార్‌పై అనుచిత వాఖ్యలు సరికాదన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకే బండి సంజయ్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. నాయకులు గణేశ్, కిరణ్‌నాయక్, దాసు, దీటి నర్సయ్య, భాస్కర్‌రెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

కథలాపూర్: మండలకేంద్రం శివారులో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన గుగ్లోత్ సంజీవ్ కోరుట్ల నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. అదే రోడ్డులో ముందు వెళ్తున్న కారును ఢీకొట్టి పడిపోయారు. సంఘటన స్థలానికి ఎస్సై నవీన్‌కుమార్ చేరుకుని వివరాలు సేకరించారు. క్షతగాత్రుడిని కోరుట్లలోని ఆస్పత్రికి తరలించారు.

ఉచిత వైద్యశిబిరం

గంభీరావుపేట: మండలంలోని ముస్తఫానగర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వందమందికి పరీక్షలు చేసి సూచనలిచ్చారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి కిషన్, సభ్యులు కమలాకర్‌రెడ్డి, నరసింహారాజు, నాగరాజుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

బోయినపల్లి: మండలంలోని స్తంభంపల్లిలో శివాజీ విగ్రహ ఏర్పాటు కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అక్కెనపెల్లి కరుణాకర్. ఉపాధ్యక్షుడిగా ల్యాగల మనోజ్, ప్రధాన కార్యదర్శిగా అక్కెనపెల్లి కల్యాణ్, కోశాధికారిగా అక్కెనపెల్లి అజయ్, ఉపాధ్యక్షులుగా బాలు, రంజిత్, సంతోష్, కార్తిక్, అనీ, మధు, తదితరులు ఎన్నికైనట్లు తెలిపారు.

బియ్యం వితరణ

ముస్తాబాద్: మండల కేంద్రానికి చెందిన అవునూరు చంద్రయ్య కుటుంబానికి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దీటి నర్సింలు 50 కిలోల బియ్యాన్ని వితరణగా ఆదివారం అందజేశారు. చంద్రయ్యది నిరుపేదకు టుంబం కావడంతో బియ్యం అందించినట్లు నర్సింలు తెలిపారు.